క్లుప్తంగా

వారసులకు ఉద్యోగాలు ఇవ్వాలని ధర్నా



మధురవాడ జోనల్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహిస్తున్న బాధితులు

మధురవాడ: జీవీఎంసీ ప్రజారోగ్యం విభాగంలో వివిధ కారణాలతో ఉద్యోగాలు కోల్పోయిన, మరణించిన కార్మికుల వారసులకు ఆప్కాస్ ద్వారా ఉద్యోగాలు ఇవ్వాలని సీఐటీయూ నాయకులు డిమాండ్ చేశారు. సోమవారం మధురవాడ జోనల్ కార్యాలయం వద్ద సీఐటీయూ ఆధ్వర్యంలో బాధితులు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐటీయూ నాయకులు డి. అప్పలరాజు, నరేంద్ర కుమార్ మాట్లాడుతూ, 60 ఏళ్లు నిండిన కార్మికుల వారసులకు ఉద్యోగాలు ఇస్తామని హామీ ఇచ్చి నెరవేర్చలేదని ఆరోపించారు. దీర్ఘకాలిక సెలవుల్లో ఉన్న కార్మికులను కూడా తిరిగి విధుల్లోకి తీసుకోవడం లేదని ఆందోళన వ్యక్తం చేశారు. అనంతరం అధికారులు వినతిపత్రం సమర్పించారు.

రాష్ట్రస్థాయి ఫుట్‌బాల్ పోటీలకు చిట్టివలస విద్యార్థి



చేట్ల త్రినాథ్

తగరపువలస: కర్నూల్ జిల్లా ఎమ్మిగనూరులో మంగళవారం నుంచి ఈనెల 25 వరకు జరగనున్న స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ రాష్ట్రస్థాయి అండర్–19 ఫుట్‌బాల్ పోటీలకు జీవీఎంసీ భీమిలి జోన్ రెండోవార్డు సంతపేట–చిట్టివలసకు చెందిన చేట్ల త్రినాథ్ పాల్గొనున్నాడు. భీమిలి మండలం తాళ్లవలస తిరుమల జూనియర్ కళాశాలలో ఎంపీసీ ద్వితీయ సంవత్సరం విద్యార్థి అయిన త్రినాథ్ గతేడాది నవంబరులో పల్నాడు జిల్లా సత్తెనపల్లిలో జరిగిన స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ రాష్ట్ర స్థాయి పోటీలలో కూడా పాల్గొన్నాడు.

వ్యవసాయ రంగ ప్రగతికి ఏఐ దోహదం



మాట్లాడుతున్న ప్రొఫెసర్ గౌతమ్‌రావు

కొమ్మాది: దేశంలో వ్యవసాయ రంగాన్ని అభివృద్ధి చేయడానికి, నాణ్యమైన పంటల ఉత్పత్తిని పెంచడానికి మానవ రహిత డ్రోన్‌లు, కృత్రిమ మేధస్సు ఎంతగానో ఉపయోగపడతాయని గీతం యూనివర్సిటీ ప్రొఫెసర్ వైస్ చాన్సలర్ వై. గౌతమ్‌రావు అన్నారు.సోమవారం గీతంలో జరిగిన ఒక కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ.. భారతదేశం వ్యవసాయ ఆధారిత ఆర్థిక వ్యవస్థను కలిగి ఉందని, సుమారు 80 శాతం మంది ప్రజలు వ్యవసాయ రంగంపై ఆధారపడి ఉన్నారన్నారు. ఈ రంగం 46 శాతం మందికి ఉపాధి కల్పిస్తోందని ఆయన పేర్కొన్నారు. ఆధునిక సాంకేతికతను ఉపయోగించడం ద్వారా వ్యవసాయ రంగంలో మరింత పురోగతి సాధించవచ్చని ఆయన అభిప్రాయపడ్డారు.

ఈ బోరును వినియోగించుకునేదెలా?



బోరుబావి చుట్టూ తుప్పలు

తగరపువలస: చిట్టివలస కార్మికవాడలోని బంతాట మైదానం ఎదురుగా ఉన్న బోరుబావి అపరిశుభ్రంగా ఉందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. బోరుబావి చుట్టూ తుప్పలు పెరిగిపోయాయని, నీరు బయటకు వెళ్లడానికి సరైన ఏర్పాటు లేదని వారు వాపోతున్నారు.ప్రస్తుతం శరన్నవరాత్రి ఉత్సవాలు జరుగుతున్న నేపథ్యంలో, భవానీ దీక్షలు ధరించిన భక్తులు స్నానాలు చేయడానికి ఈ బోరుబావిని ఉపయోగించే అవకాశం ఉందని, కాబట్టి దానిని వెంటనే శుభ్రం చేసి, చుట్టూ ప్లాట్‌ఫామ్ (పళ్లెం) ఏర్పాటు చేయాలని కార్మికవాడ ప్రజలు కోరుతున్నారు.

నేటి నుంచి కేరళ ఆయుర్వేద శిబిరం

డాబాగార్డెన్స్ : ఆయుర్వేద పంచకర్మ విధానం ద్వారా దీర్ఘకాల రోగాలకు చికిత్స అందించేందుకు ఈ నెల 23, 24న కేరళ మెగా ఆయుర్వేద శిబిరం నిర్వహించనున్నట్టు ఔషధాలయ మేనేజర్ దినుప్ తెలిపారు. జీవీఎంసీ ప్రధాన గేట్ ఎదురుగా రాంనగర్ వైద్యరాజ్ ఔషధాలయంలో ప్రముఖ కేరళ వైద్యుడు డాక్టర్ కేఎం ఉన్నికృష్ణన్ నాయర్ 2 రోజులపాటు అందుబాటులో ఉంటారని తెలిపారు.

కన్ను పడితే కబ్జా



ప్రభుత్వ స్థలాన్ని చదును చేసి వ్యాపారానికి ఉంచిన మొక్కలు



హైవేని ఆనుకుని ఉన్న గెడ్డను పూడ్చడానికి వేసిన డెబ్రిస్



బొట్టవానిపాలెం వద్ద భారీ కాలువ ఆనవాళ్లే లేకుండా జోరుగా సాగుతున్న నిర్మాణాలు

- గెడ్డలు, కాలువలను మింగేస్తున్న ఆక్రమార్కులు
- అధికార పార్టీ అండదండలతోనే ఆక్రమణలు
- యంత్రాంగం నిద్ర మత్తు



కొమ్మాది జంక్షన్ పెట్రోల్ బంకు వద్ద కల్వర్టు దుస్థితి



మధురవాడ అప్ బ్రిడ్జి వద్ద చిన్న పాటి వర్షానికే రోడ్డు మీదకి వచ్చిన వర్షం నీరు



నగరంపాలెం రోడ్డులో కాలువపైకి వచ్చిన నిర్మాణాలు

మధురవాడ: మధురవాడ పరిసర ప్రాంతాల్లో ప్రభుత్వానికి చెందిన గెడ్డలు, కాలువలు, రోడ్డు స్థలాలు యథేచ్ఛగా కబ్జా అవుతున్నాయి. సచివాలయ వ్యవస్థ, వీఆర్‌వోలు ఉన్నప్పటికీ ఈ అక్రమాలను అరికట్టడంలో అధికారులు పూర్తిగా విఫలమయ్యారని విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

ముంపు ముప్పు

కొమ్మాది నుంచి పరదేశిపాలెం మధ్య హైవే పక్కన ఉన్న భారీ కాలువలను ఆక్రమించి పూడ్చివేస్తున్నారు. దీంతో చిన్నపాటి వర్షానికే నీరు నిలిచిపోయి ఈ ప్రాంతాలు చెరువులను తలపిస్తున్నాయి. మధురవాడ అప్ బ్రిడ్జి, నగరంపాలెం, పరదేశిపాలెం, కొమ్మాది, బింద్రానగర్ వంటి ప్రాంతాల్లో కోట్లాది రూపాయల విలువైన ప్రభుత్వ భూములు అన్యాక్రాంతమవుతున్నాయి. భవనాలు, అపార్ట్‌మెంట్ల ముందు ఉన్న కాలువలను ఇష్టానుసారం పూడ్చివేసి నీటి పారుదలకు అడ్డుకట్ట వేస్తున్నారు.

అధికార పార్టీ అండదండలు?

ఓజోన్ వ్యాలీ ఆర్చ్, మెట్రో మాల్, మారికవలస సమీపంలో కొందరు వ్యక్తులు అధికార పార్టీ నాయకుల అండతో రాత్రికి రాత్రి హైవేని ఆనుకుని ఉన్న గెడ్డలను భవన వ్యర్థాలు, మట్టితో పూడ్చేస్తున్నారు. చదును చేసిన ఈ విలువైన స్థలాల్లో షెడ్లు, ఇతర నిర్మాణాలు చేసి, కరెంటు మీటర్లు కూడా పొందుతున్నారు. మారికవలస–పరదేశిపాలెం మధ్య బడా భవనాలు, వ్యాపార సంస్థల ముందు కాలువలకు ఆనవాళ్లు లేకుండా చేస్తున్నారు.

కార్పొరేటర్ ఇంటి పక్కనే ఆక్రమణ

జీవీఎంసీ 5వ వార్డులోని గణేష్‌నగర్–బొట్టవానిపాలెం వద్ద ఒక కార్పొరేటర్ ఇంటికి సమీపంలోనే ఓ భవన యజమాని భారీ కాలువ, కల్వర్టును పూర్తిగా మూసేశాడు. తన భవనానికి అడ్డంగా ఉందని భావించి, కల్వర్టుపై స్లాబులు వేసి, సుమారు 30 అడుగుల మేర కాలువను పూడ్చివేశాడు. దీంతో కనీసం మ్యాన్‌హోల్ కూడా కనిపించకుండా పోయింది.

అధికారుల నిర్లక్ష్యం



ఓజోన్ వ్యాలీ వద్ద భారీ గెడ్డను కప్పేసి చిన్న కాలువను తీసిన అక్రమార్కులు



స్వతంత్రనగర్ వైపు వెళ్లే రోడ్డు వద్ద ఒక వైపు మాత్రమే కనిపిస్తున్న కల్వర్టు

హైవే నుంచి నగరంపాలెం వరకు ఉన్న మాస్టర్‌ప్లాన్ రోడ్డు పరిస్థితి కూడా దారుణంగా ఉంది. 20 అడుగులు ఉండాల్సిన గెడ్డ కొన్ని చోట్ల 5 అడుగులకు కుంచించుకుపోయింది. రెవెన్యూ సిబ్బంది అప్పుడప్పుడు వచ్చినా, జీవీఎంసీ యంత్రాంగం నిద్రమత్తులో ఉందని స్థానికులు ఆరోపిస్తున్నారు. ఈ అక్రమాల కారణంగా మధురవాడ అప్‌బ్రిడ్జి, డైలీ మార్కెట్, చంద్రంపాలెం, శివశక్తి నగర్ వంటి ప్రాంతాలు ముంపునకు గురవుతున్నాయి. ఉన్నతాధికారులు తక్షణమే స్పందించి కబ్జాదారులపై చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

గ్రావెల్ కొల్లగొడుతున్న టీడీపీ నేతలు

తగరపువలస: మండలంలోని చిప్పాడ కొండపై అధికార పార్టీ నాయకులు అక్రమంగా గ్రావెల్ తవ్వకాలు చేపడుతున్నారు. రెండు రోజులుగా భారీ యంత్రాలను ఉపయోగించి గ్రావెల్‌ను లారీలు, ట్రాక్టర్లలో తరలిస్తూ సొమ్ము చేసుకుంటున్నారు. ఈ అక్రమాలకు టీడీపీకి చెందిన మాజీ సర్పంచ్ నాయకత్వం వహిస్తున్నట్లు సమాచారం. వీఆర్‌వో, సచివాలయ సిబ్బందికి ఈ విషయం తెలిసినా, అధికార పార్టీ ఒత్తిడితో మౌనంగా ఉన్నారని పంచాయతీ వాసులు మండిపడుతున్నారు. గతంలో వైఎస్సార్ కాలనీకి రహదారులు, నిర్మాణాల కోసం గ్రావెల్ తరలించినప్పుడు అడ్డుకున్న నాయకులు ఇప్పుడు కబ్జాదార్లకు అండగా ఉండడంపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.అధికారాన్ని అడ్డుపెట్టుకుని రూ. లక్షలు వెనకేసుకుంటున్న టీడీపీ నాయకులపై భీమిలి రెవెన్యూ అధికారులు తక్షణమే చర్యలు తీసుకోవాలని, అక్రమ తవ్వకాలను అడ్డుకోవాలని పలువురు డిమాండ్ చేస్తున్నారు.

ఆరోగ్యంపై మహిళలు మరింత శ్రద్ధ వహించాలి



పౌష్టికాహార ప్రదర్శనను తిలకిస్తున్న ఎంపీపీ

పద్మనాభం: మహిళలు తమ ఆరోగ్యం పట్ల మరింత శ్రద్ధ వహించాలని ఎంపీపీ కంటుబోతు రాంబాబు అన్నారు. మండలంలోని మద్ది గ్రామంలో సోమవారం 'స్వస్థ్ నారీ సశక్త్ పరివార్ అభియాన్'లో భాగంగా నిర్వహించిన ఉచిత వైద్య శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహిళలు ఇలాంటి వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకొని ఆరోగ్య పరీక్షలు చేయించుకోవాలని కోరారు. వైద్య శిబిరాలు నిర్వహించేటప్పుడు ముందుగానే ప్రచారం చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో భాగంగా ఆయన యూ–విన్ టీకా ప్రక్రియ పోస్టర్‌ను ఆవిష్కరించారు. అలాగే పౌష్టికాహార ప్రదర్శనను తిలకించారు. కార్యక్రమంలో రేవిడి పీహెచ్‌సీ వైద్యాధికారి కె. లీలాప్రసాద్, ఆయుర్వేద వైద్యాధికారి సౌజన్య, మాజీ ఎంపీటీసీ సభ్యుడు బి. శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

శరన్నవరాత్రి ఉత్సవాలు ప్రారంభం



చిట్టివలస గణేష్ థియేటర్ కూడలిలో అమ్మవార్లకు పూజలు



పీఎంపాలెం : బాలాత్రిపుర సుందరీ దేవి అవతారంలో...



మోగదారమ్మ ఆలయంలో సామూహిక కుంకుమార్చనలో పాల్గొన్న మహిళలు



పద్మనాభంలో దేవి మండపం వద్ద భవాని భక్తులు

తగరపువలస: శరన్నవరాత్రి ఉత్సవాలు సోమవారం వైభవంగా ప్రారంభమయ్యాయి. వేలాది మంది భక్తులు భవానీ దీక్షలు చేపట్టారు. మొదటిరోజు అమ్మవారు శ్రీబాలా త్రిపుర సుందరీ దేవి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు.స్థానిక బైపాస్ రోడ్డులోని శ్రీవిజయ దుర్గా ఆలయం, సంగివలసలోని ముగ్గురు అమ్మవార్ల ఆలయాలు భక్తులతో కిక్కిరిసిపోయాయి. చిట్టివలస బంతాట మైదానంలో ఎర్నింటి బ్రదర్స్ ఏర్పాటు చేసిన సింహవాహనంపై 25 ముఖాల అమ్మవారి మట్టి విగ్రహం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. గణేష్ థియేటర్ కూడలిలో పానీపూరి ప్రసాద్ ఆధ్వర్యంలో దుర్గాదేవి ఒడిలో బాలా త్రిపుర సుందరీదేవి మట్టి విగ్రహాన్ని ఏర్పాటు చేశారు. అంబేడ్కరు కూడలిలో శ్రీదుర్గాంబికా ఆటో సంఘం కనకదుర్గ అమ్మవారి విగ్రహం ఏర్పాటు చేశారు. భీమిలి మండలం తాటితూరులో శాలివాహన యువజన సేవాసంఘం శ్రీసరస్వతీ దేవి నవరాత్రులలో భాగంగా సరస్వతీదేవి విగ్రహాన్ని ప్రతిష్ఠించారు.

బబ్బేలమ్మ ఆలయంలో .

పీఎం పాలెం: కారుషెడ్ బబ్బేలమ్మ ఆలయంలో దసరా శరన్నవరాత్రి ఉత్సవాలు సోమవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. వేద పండితుల ఆధ్వర్యంలో పుణ్యాహవచనం, కంకణ బంధన కలశ స్థాపన వంటి పూజా కార్యక్రమాలు నిర్వహించారు. మొదటి రోజు అమ్మవారు బాలా త్రిపుర సుందరి దేవి అవతారంలో భక్తులకు దర్శనమిచ్చారు. పసుపు రంగు వస్త్రాలు, పసుపు రంగు గాజులతో అమ్మవారిని అలంకరించారు.అమ్మవారికి గోధుమ నూకతో తయారు చేసిన ప్రసాదాన్ని నైవేద్యంగా సమర్పించి, భక్తులకు పంపిణీ చేశారు. ఆలయ మండపంలో భక్తులు సామూహిక కుంకుమార్చనలు నిర్వహించారు.

మధురవాడలో..

మధురవాడ: మధురవాడ పరిసర ప్రాంతాల్లో శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా తొలిరోజు అమ్మవారు బాలా త్రిపుర సుందరి దేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. జాతర గట్టు చంద్రంపాలెం దుర్గాలమ్మ ఆలయంలో అర్చకులు పట్నాల హరిప్రసాద్, మూర్తి శర్మ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. మధురవాడ టైలర్స్ కాలనీలోని విజయ దుర్గాదేవి ఆలయంలో శ్రీకాంత్ శర్మ పూజా కార్యక్రమాలను పర్యవేక్షించారు. ఈ సందర్భంగా పలువురు భక్తులు భవానీ దీక్షలు చేపట్టారు.

సామూహిక కుంకుమ పూజలు

కొమ్మాది: దుర్గాదేవి శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా బీచ్ రోడ్డులోని సాగర్‌నగర్‌లో ఉన్న శ్రీ మోగదారమ్మ మహాలక్ష్మి ఆలయంలో పెద్ద ఎత్తున భక్తులు సామూహిక కుంకుమ పూజల్లో పాల్గొన్నారు. కొమ్మాది అష్టలక్ష్మి ఆలయంలో కలశ స్థాపన, వరలక్ష్మి అమ్మవారికి అభిషేకాలు నిర్వహించి నవరాత్రి ఉత్సవాలను ప్రారంభించారు. ఎండాడ, మంగమారిపేట, చేపలుప్పాడ, మారికవలస, కొమ్మాది వంటి పలు ప్రాంతాల్లోనూ దుర్గాదేవి పూజలు ఘనంగా జరుగుతున్నాయి.

భీమునిపట్నం: భీమిలి మెయిన్ రోడ్డు పాత బస్టాండ్ వద్ద నూకాంబిక ఆటో డ్రైవర్స్ యూనియన్ వారు దుర్గాదేవి అమ్మవారి విగ్రహాన్ని ఏర్పాటు చేశారు. గొల్లవీధి కృష్ణుడు బొమ్మ సెంటర్ యూత్ ఆధ్వర్యంలో అమ్మవారి బొమ్మను ఏర్పాటు చేసి ప్రత్యేక పూజలను నిర్వహించారు.

పద్మనాభం: మండలంలోని పలు చోట్ల సోమవారం శరన్నవరాత్రి ఉత్సవాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. మద్దిలోని సాగర దుర్గా ఆలయంలోను ఈ ఉత్సవాలు ప్రారంభమయ్యాయి. , పద్మనాభం గ్రామంలో దేవి విగ్రహాన్ని నిలిపారు. సాగర దుర్గా ఆలయంలో ఎంపీపీ కంటుబోతు రాంబాబు పూజలు చేశారు.



తాటితూరులో సరస్వతీదేవి అవతారంలో...



చిట్టివలసలో 25 ముఖాలతో సింహవాహనంపై అమ్మవారు



ఎండాడలో దుర్గాదేవి అమ్మవారు



నూకాంబికా ఆటో డ్రైవర్స్ యూనియన్ ఆధ్వర్యంలో..



గొల్లవీధి కృష్ణుడు బొమ్మ సెంటర్‌లో..



మధురవాడ : బాలా త్రిపుర సుందరీ దేవిగా దుర్గాలమ్మ

వీధి వ్యాపారుల ఉపాధికి భద్రత కల్పిస్తాం



పట్టణ స్థాయి వీధి విక్రయ దారుల సంఘం సమావేశంలో మాట్లాడుతున్న జెడ్సీ కనక మహాలక్ష్మి

మధురవాడ: వీధి వ్యాపారుల ఉపాధికి ఇబ్బంది కలగకుండా తగిన చర్యలు తీసుకుంటామని జీవీఎంసీ జోన్–2 కమిషనర్ కొట్యాడ కనక మహాలక్ష్మి తెలిపారు. సోమవారం జోనల్ కార్యాలయంలో జరిగిన పట్టణ వీధి విక్రయదారుల సంఘం సమావేశంలో ఆమె మాట్లాడారు. ఈ సమావేశంలో కమిటీ సభ్యులు పి. రాజ్‌కుమార్, టి. ప్రదీప్ కుమార్, ఆదినారాయణ తదితరులు మాట్లాడుతూ గతంలో వీధి వ్యాపారులకు గుర్తింపు కార్డులు, ఉపాధి భద్రత కల్పిస్తామని అధికారులు చెప్పారని, కానీ ఇప్పుడు తమకు సమాచారం ఇవ్వకుండానే ఉపాధిని దెబ్బతీస్తున్నారని ప్రశ్నించారు. దీనిపై జెడ్సీ కనక మహాలక్ష్మి, ఏసీపీ శబ్నాన్ శాస్త్రి స్పందిస్తూ.. హాకర్స్ జోన్‌లు ఏర్పాటు చేయడానికి చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. అయితే రోడ్లకు అడ్డంగా, ఫుట్‌పాత్‌లపై వ్యాపారాలు చేసి ట్రాఫిక్‌కు, ప్రజల రాకపోకలకు ఇబ్బంది కలిగించవద్దని వారు కోరారు. ఈ సమావేశంలో పలువురు అధికారులు, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

చిరు వ్యాపారుల పొట్ట కొట్టడం సరికాదు



మధురవాడ జోనల్ కార్యాలయం వద్ద సీఐటీయూ ఆధ్వర్యంలో ధర్నా చేస్తున్న చిరు వ్యాపారులు



జెండాతో ధర్నాకు హాజరైన దివ్యాంగుడు

- కూటమి ప్రభుత్వంపై సీఐటీయూ ఆగ్రహం
- మధురవాడలో ఆందోళన

మధురవాడ: చిరు వ్యాపారులు, చిల్లర వర్తకుల ఉపాధికి భంగం కలిగించడం సరికాదని సీఐటీయూ నాయకుడు డి. అప్పలరాజు పేర్కొన్నారు. కూటమి ప్రభుత్వం పేదల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందన్నారు. సోమవారం మధురవాడ జీవీఎంసీ జోన్–2 కార్యాలయం వద్ద సీఐటీయూ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా అప్పలరాజు మాట్లాడుతూ.. ట్రాఫిక్‌కు అంతరాయం పేరుతో చిరు వ్యాపారుల జీవనాన్ని రోడ్డు పాలు చేయడం అన్యాయమని అన్నారు. కనీసం చట్టాలు, అధికారుల మాటలకు కూడా గౌరవం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. జరిగిన నష్టానికి కూటమి ప్రభుత్వమే బాధ్యత వహించాలని డిమాండ్ చేశారు. అధికారులు వ్యాపారులకు వారి సరుకులను కూడా తీసుకునే అవకాశం ఇవ్వకుండా తొలగించడం దారుణమని ఆయన పేర్కొన్నారు. తక్షణమే హాకర్స్ జోన్స్ ఏర్పాటు చేసి, అవి ఏర్పాటు చేసేంత వరకు ప్రస్తుతం వ్యాపారం చేసుకుంటున్న చోటే కొనసాగించడానికి అవకాశం ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు పి. రాజ్‌కుమార్, చిల్లర వర్తకులు, తోపుడు బండ్ల సంఘం నాయకులు వరలక్ష్మి, ఆదినారాయణ, సురేష్, దనుంజయరావు, రాజేశ్వరి, రమణ తదితరులు పాల్గొన్నారు.

వెల్‌నెస్ సెంటర్ల పరిశీలన



మద్ది వెల్ నెస్ సెంటర్ వద్ద ప్రపంచ బ్యాంకు బృందం

పద్మనాభం: మండలంలోని మూడు వెల్ నెస్ సెంటర్లను డాక్టర్ వర్ష, డాక్టర్ భార్గవి, డాక్టర్ సరితలతో కూడిన ముగ్గురు సభ్యుల ప్రపంచ బ్యాంకు బృందం సోమవారం సందర్శించింది. మద్ది, గంధవరం, కొవ్వాడ వెల్ నెస్ సెంటర్లను వీరు సందర్శించారు. ఈ సెంటర్లలో రోజు ఎంత మంది రోగులకు పరీక్షలు చేస్తున్నారు, ఏ వ్యాధులకు సంబంధించి ఎక్కువగా రోగులు పరీక్షల కోసం వస్తున్నారు, మందులు ఉన్నాయా ? లేదా పరిశీలించారు.

దివ్యాంగుల ప్రతిభను గుర్తించి ప్రోత్సహించాలి

మద్దిలపాలెం : సమ్మిళితం చేస్తూ దివ్యాంగ చిన్నారులను సాధికారత దిశగా నడిపించాలని ఆంధ్ర విశ్వవిద్యాలయం రెక్టార్ ఆచార్య ఎస్.కిషోర్‌బాబు అన్నారు. ఏయూ ఇంజినీరింగ్ కళాశాలలోని గౌతమ్ బుద్ధ డాక్టర్ బి.ఆర్.అంబేడ్కర్ ఆడిటోరియంలో సోమవారం నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఫర్ ది ఎంపవర్‌మెంట్ ఆఫ్ ది పర్సన్స్ విత్ ఇంటలెక్చువల్ డిజెబిలిటీస్, విద్యా విభాగం సంయుక్తంగా పర్పుల్ ఫెయిర్ కార్యక్రమం నిర్వహించాయి. ఈ సందర్భంగా ఆచార్య కిషోర్ బాబు మాట్లాడుతూ దివ్యాంగుల్లో ఉన్న ప్రత్యేక నైపుణ్యాలను గుర్తించి ప్రోత్సహించాలని సూచించారు. దివ్యాంగుల్లోని నైపుణ్యాలు, సృజనాత్మకత ప్రదర్శించే వేదికగా ఈ కార్యక్రమాన్ని నిర్వహించడంపై సంతోషం వ్యక్తం చేశారు. కేంద్ర ప్రభుత్వ సామాజిక న్యాయ, సాధికారత మంత్రిత్వ శాఖ డైరెక్టర్ వినీత సింఘాల్ మాట్లాడుతూ జాతీయ విద్యా విధానం – 2020లో భాగంగా విద్యలో అందరినీ భాగం చేయడమే లక్ష్యంగా కేంద్ర ప్రభుత్వం కృషి చేస్తోందని చెప్పారు. దేశవ్యాప్తంగా అన్ని రాష్ట్రాల్లో అవగాహన కార్యక్రమాలు విస్తృతంగా నిర్వహిస్తున్నట్లు చెప్పారు. శతాబ్ది ఉత్సవాలు నిర్వహిస్తున్న శుభ సమయంలో ఇటువంటి కార్యక్రమానికి ఏయూ తోడ్పాటు అందించడం సంతోషకరమన్నారు.

పంట పొలాల మధ్య పందుల పెంపకంతో కాలుష్యం



పంట పొలాల మధ్య పందుల షెడ్డు



షెడ్డులో పందులు

తగరపువలస: ఆనందపురం పంచాయతీలో పంట పొలాల మధ్య పందుల పెంపకంపై రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. మధురవాడకు చెందిన ఒక వ్యక్తి స్థానిక టీడీపీ నాయకుడి నుంచి భూమిని లీజుకు తీసుకుని, దాదాపు 200 పందులను పెంచుతున్నాడు. అయితే దీనికి పంచాయతీ నుంచి ఎలాంటి అనుమతులు లేవు. పందుల ఫారం నుంచి వచ్చే వ్యర్థాలను పంట కాలువల ద్వారా చెరువులోకి వదలడం వల్ల రైతులు ఇబ్బందులు పడుతున్నారు. ఈ వ్యర్థాల కారణంగా పొలాలకు వెళ్లే రైతులకు దురదలు వంటి ఆరోగ్య సమస్యలు వస్తున్నాయని వారు వాపోతున్నారు.